వేదిక

'వేదిక' పేజీ కోసం సమకాలీన అంశాలపై వ్యాసాలను ఈ చిరునామాకు పంపించండి. మీ వ్యాసం 700 పదాలకు మించకుండా ఉండాలి. చిరునామా: 8-2-603, 1/7,8,9 కృష్ణాపురం, రోడ్ నం.10, బంజారాహిల్స్, హైదరాబాద్-500034. e-mail: editpage@ntnews.com

నమస్తే తెలంగాణ

పోడు జీవుల గోడు

అటవీభూముల విషయంలో కాంగ్రెస్ సర్కారు రెండు నాల్కల ధోరణి విస్మయం కలిగిస్తున్నది. హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలోని అటవీ ప్రాంతాన్ని చెరబట్టబోయి భంగపడిన సంగతి తెలిసిందే. అదే సర్కారు గిరిజన ప్రాంతాల్లోని భూములను అటవీ భూములంటూ నానా హంగామా చేస్తున్నది. అడవిబిడ్డలను కడగండ్ల పాలు చేస్తున్నది. ఈ ప్రభుత్వ హయాంలో జరిగిన్న ఘోర దురాగతాలు ఇన్నీఅన్నీ కావు. విద్యార్థులు, బుద్ధిజీవులు కలిసిపోరాడితే గానీ కేంద్ర వర్సిటీ భూములను కాపాడుకోవడం సాధ్యపడలేదు. కానీ, అమాయక గిరిజనుల విషయం అలా కాదు. కొండల్లో, కోనల్లో జీవనం సాగించే అడవి బిడ్డలు పోడు భూములను కాపాడుకునేందుకు నానా అగచాట్లు అనుభవించాల్సి వస్తున్నది. పోలీసుల బూట్ల కింద తండాలు, గూడేలు నలిగిపోతున్నాయి. ప్రతిఘటిస్తే దయాదాక్షిణ్యాలు చూపకుండా, ఆడామగా అనే తేడా లేకుండా నరకం చూపిస్తున్నారు. నిన్నామొన్నటి లగచర్ల నుంచి రంగంపేట, కోసగుంపు వరకు ఇదే తతంగం. 'ప్రాణాలైనా వదులుకుంటం కానీ భూములను వదులుకోబోమ'ని గిరిజనులు అంటే సర్కారు పోలీసు లాఠీని ప్రయోగించి దమనకాండకు దిగుతున్నది. వారు మన పౌరులు, మనం కాపాడాల్సిన పౌరులు అనే స్పృహ లేకుండా తరిమితరిమి కొడుతున్నది. మహిళలపై హింస ప్రయోగించడం సర్కారు కర్కశత్వానికి పరాకాష్ఠ. ఇది ఏ తరహా ప్రజాపాలన?

మొన్నటికిమొన్న రాజన్న సిరిసిల్లా జిల్లాలోని రంగంపల్లిలో పోడు భూములపైకి సర్కారు దండెత్తింది. ఎవుసమే జీవనాధారంగా బతికే రైతన్నల నోటికాడి ముద్ద ఎత్తగొట్టేందుకు సమకట్టింది. ఇంకా పట్టాలివ్వని పోడు భూములను అటవీ భూములంటూ వితండవాదం ముందుకుతెచ్చింది. ప్లాంటేషన్ పేరుతో లాగేసుకునేందుకు సర్కారు ఎత్తులు వేసింది. ఊరు ఊరంతా ఒక్కటై ఎదురుతిరగడంతో తోకముడిచింది. ఇక భద్రాద్రి జిల్లా కోసగుంపులో జరిగిన దారుణాలు లగచర్ల దురాగతాలను మరిపించేలా ఉన్నాయి. శత్రు దేశంపైకి శతఘ్నులు తోలినట్టుగా అక్కడి భూములపైకి సర్కారు జేసీబీలతో దండెత్తింది. ఇదేమిటని ప్రశ్నించిన గిరిజన మహిళలతో ఖాకీలు వ్యవహరించిన తీరు సభ్య సమాజం తలదించుకునేలా ఉంది. ఎప్పటినుంచో సాగు చేసుకుంటున్న భూముల్లోకి ఎందుకు వచ్చారని ప్రశ్నిస్తే నాటిన విత్తనాలు తవ్విపోస్తామంటూ రెచ్చిపోయారు. నిస్సహాయ మహిళలపై కీచకపర్వం సాగించడం పరమ దుర్మార్గం. 18 నెలల పాలనలో ఆదివాసీ గూడేలపై 22 దాడులు జరగడం దారుణం. ఇదేనా కాంగ్రెస్ తెస్తానన్న మార్పు?

నిజమే. ఇదివరకటి బీఆర్ఎస్ పాలన ఎక్కడ? ఇప్పటి కాంగ్రెస్ పాలన ఎక్కడ? ఎంత తేడా. ఎక్కడి నుంచి ఎక్కడకు పడిపోయామని ప్రజలు వాపోతున్నారు. సుదీర్ఘకాలంగా తండాలు, గూడేలు కోరుకున్న స్వయంపాలన అవకాశాలు కల్పిస్తూ వాటిని గ్రామ పంచాయతీలుగా అభివృద్ధి చేసింది కేసీఆర్ ప్రభుత్వం. 'మావ నాటే మావ రాజ్' నినాదాన్ని నిజం చేసింది. జీవనాధారమైన పోడు భూముల సమస్యను శాశ్వతంగా పరిష్కరిస్తూ గిరిపుత్రులకు పట్టాలు పంపిణీ చేసి రికార్డు సృష్టించింది. 'మావ జమీన్.. మావ పట్టా' నినాదాన్ని సాకారం చేసి దేశానికే ఆదర్శంగా నిలిచింది. దేశవ్యాప్తంగా అటవీ హక్కుల చట్టం అమల్లోకి వచ్చాక ఏకకాలంలో నాలుగు లక్షల పైచిలుకు ఎకరాలకు పట్టాలు పంపిణీ చేయడం ఓ చరిత్ర. ప్రస్తుత కాంగ్రెస్ మంత్రి సీతక్క తల్లిదండ్రులు కూడా లబ్ధిదారుల్లో ఉండటం విశేషం. గిరిపుత్రులు ప్రశాంతంగా వ్యవసాయం చేసుకుని హాయిగా జీవిస్తారనే చల్లని తలంపుతో ఈ మార్పులు ప్రవేశపెట్టింది బీఆర్ఎస్ సర్కారు. అందుకు భిన్నంగా కాంగ్రెస్ సర్కారు గిరిజనులను వారికి ప్రాణసమానమైన భూమికి దూరం చేసేందుకు వికృత మార్గాలు అనుసరించడం దుర్మార్గం.

నీళ్లిచ్చిన నాయకునిపై నిందలా?

ఆట రానోళ్లకు
ఏ వేషమేసినా అదే రాగం అదే రోగం
గిట్టని కారుకూతలు
తిట్టకపోతే ముద్ద దిగదు కునుకు రాదు
జీవధారపై కడుపు మంట
చెత్తకుండీల్లా నోళ్లు

కాలిరిగినంత మాత్రాన
మనిషే పోయినట్లు దుష్ప్రచారం
రాష్ట్ర బతుకు చిత్రాన్ని మార్చిన
కాళేశ్వర జలాశయంపై
కుట్రలు కుతంత్రాలు అభాండాలు
అత్యంత ప్రమాదకర ప్రచారాలు

కాళేశ్వరం గలగల నవ్వితే
కాంగ్రెసుకు భవిష్యత్ లేదు
తెల్లారి లేస్తే నిద్రలో కూడా
కాళేశ్వరం బుగులు
లక్షల ఎకరాలకు నీళ్లు
తరతరాల కరువు తండ్లాటకు
అయిదేళ్లలో జలావిష్కరణలు

ఎత్తిపోతలంటూ
నదిని అందకుండా చేశారు
నీళ్లులేక గొంతెండి గోడాడుతుంటే
పదవుల కోసం పెదవులు మూశారు
పెట్టుబడిదారులు
సీమాంధ్రను సస్యశ్యామలం చేస్తుంటే
తాళాలుగొట్టి తాంబూలాలతో హారతులిచ్చారు
నదీ జలాలంటే ప్రవహించే పుత్తడులు

తెలంగాణ రాష్ట్రమడిగితే
వేలాది మంది ఉసురు పోసుకున్నారు
తుపాకుల కాల్పులతో
ఉద్యమాన్ని సమాధి చేయాలనుకున్నారు
అనేకానేక పోరాటాలు త్యాగాలతో
నయవంచకుల మెడలొంచి
జై తెలంగాణ అనకుంటే దిక్కుతోచని స్థితిలో
'తెలంగాణ'కు సై అన్నారు

గారడి మాటల మాయోపాయాలకు నేల కుదేలు
మాంత్రికుల మాయాజాలానికి
మొక్కలు అల్లల్లాడుతున్నాయి
జీవాలు నోళ్లు తెరిచాయి
అనతికాలంలోనే
కాలువలు చెరువులు అలుగు దుంకు
తుంటే గుండె గుభేలు
మందారపు వికాసంలా ధాన్యపు సిరులు

నీళ్లకై జరిగిన ఉద్యమాలు
మీకెన్నడు మదిలో లేవు
పిశాచ గణాల గొట్టాలు తొండితనాలు
దబాయింపులు
పెంపుడు బిడ్డల అసహన అక్షరాలు
ప్రాజెక్టులు కట్టలేని చేతకానితనం మరిచి
నీళ్లందించిన చేతులకు నోటీసులు

తొలిపొద్దు తెలంగాణ
సూర్యతేజం మాసిపోదు
ఆనవాళ్లు చెరిపెయ్యడానికి
ఆర్టీసీ బస్సు రంగుగాదు
విచారణల పేరున
కాలం గడుపుకోవటమే తప్ప
ప్రజలకిచ్చిన హామీలు శూన్యం

వనపట్ల సుబ్బయ్య
94927 65358

ఎమర్జెన్సీ.. నా అనుభవాలు

భారతదేశ రాజకీయ చరిత్రలో అదొక (ఎమర్జెన్సీ) చీకటి కోణం. రాజ్యాంగమే కల్పించిన ఒకానొక వెసులుబాటుకు పాలకుల స్వార్థచింతన తోడైనప్పుడు జరిగిన విధ్వంసాలకు, దేశ ప్రజలు ఎదుర్కొన్న తీవ్రమైన నిర్బంధకాండకు నేను ప్రత్యక్ష సాక్షిని. ప్రతిపక్షాలు, ప్రజాస్వామికవాదులు, పౌరహక్కుల ప్రేమికులు, ప్రజా ఉద్యమకారులు వేలమంది ఈ నిర్బంధాలను ఎదుర్కొని జైళ్లలో మగ్గిపోయారు. నాటి ప్రధాని ఇందిరాగాంధీ రాజకీయ ఎత్తుగడలతో ఎమర్జెన్సీని అమలు చేస్తే, ఆమె చిన్న కుమారుడు సంజయ్ గాంధీ చేసిన ప్రజాస్వామిక వ్యతిరేక పనులు దేశంలో భీతావహపరిస్థితిని కల్పించాయి. ఆ జ్ఞాపకాలను నెమరువేసుకుంటే, అప్పుడప్పుడే ఆరంభమైన నా విప్లవోద్యమ తొలి అడుగులు జ్ఞాపకం వస్తాయి. నాపై ప్రయోగించిన చిత్రహింసలు ఆ చీకటి రోజులకు తార్కాణంగా నిలుస్తాయి. ఎమర్జెన్సీ కాలపు దుర్మార్గాలకు ప్రత్యక్ష సాక్షిగా ఉన్న నేను, నాటి నా అనుభవాలను పంచుకోవడం చారిత్రక అవసరం.

నారదాసు లక్ష్మణ్‌రావు

ఎమర్జెన్సీ.. @50 ఏండ్లు

1970లో మా పక్క గ్రామమైన పర్లపల్లి హైస్కూల్లో నేను 8వ తరగతి చదువుతున్నప్పుడు ప్రధానోపాధ్యాయులుగా బదిలీపై వచ్చిన ఆకుల లింగయ్య నా జీవితాన్ని గొప్ప మలుపు తిప్పారు. అభ్యుదయ భావాలు కలిగిన లింగయ్య, కమ్యూనిస్టు సిద్ధాంతాల పట్ల అవగాహన కూడా ఉన్న వ్యక్తి. నాకు తెలియకుండానే నా లోపల విప్లవ బీజాలు నాటిన మేధావి ఆయన. శ్రీశ్రీ సాహిత్యాన్ని నాకు తొలిసారిగా అందించి, ఆకర్షణకు లోను చేశాడు. అంతేకాదు, పిలుపు (మాసపత్రిక), మహాప్రస్థానం, రెక్కవిప్పిన రెవల్యూషన్, భవన్స్ జర్నల్, రీడర్స్ డైజెస్ట్, సృజన లాంటి పుస్తకాలు ఇచ్చి చదువమని చెప్పారు. అవి చదువుతున్నప్పుడు భావోద్వేగానికి గురయ్యేవాడిని. ప్రపంచాన్ని కొత్త కోణంలో చూస్తున్నానన్న భావన నాకు కలిగేది.

> 1973లో లింగయ్య కరీంనగర్‌లో ఉన్న బి.విజయ్‌కుమార్, పెండ్యాల సంతోష్ కుమార్‌లకు నన్ను పరిచయం చేస్తూ 'ఇతను మీకు పనికివస్తాడు' అని చెప్పాడు. ఆయన మాటలు నాడు నాకేమీ అర్థం కాలేదు. కానీ, వారితో సాన్నిహిత్యం పెరిగిన కొద్దీ, వాళ్లు అప్పటికే ఒక సిద్ధాంతాన్ని మోసే బాధ్యతలో ఉన్నారన్న విషయం కొద్దికొద్దిగా తెలియవచ్చింది. బి.విజయ్ కుమార్ ద్వారా మల్లోజుల కోటేశ్వరరావు, ముప్పాళ లక్ష్మణ్ రావు, చండుపట్ల కృష్ణారెడ్డిలు పరిచయమయ్యారు. అలా నా విప్లవ జీవిత ప్రస్థానంలో తొలుత కలిసి నడిచింది వీరితోనే.

1973లో కరీంనగర్ ఆర్ట్స్ కాలేజీలో నేను ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరంలో జాయిన్ అయ్యాను. అదే సమయంలో మల్లోజుల కోటేశ్వరరావు కరీంనగర్‌లోని ఎస్ఆర్ఆర్ కళాశాలలో బీఎస్సీ మొదటి సంవత్సరం చదువుతున్నాడు. భారతదేశ విప్లవోద్యమ చుక్కాని అయిన ముప్పాళ లక్ష్మణరావు కరీంనగర్ జిల్లాలోనే ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్నాడు. నల్ల ఆదిరెడ్డి, శనిగరపు వెంకటేశ్వర్లు (సాహు) జమ్మికుంట ప్రభుత్వ కళాశాలలో డిగ్రీ చదువుతుండగా, అల్లం నారాయణ మంథనిలో ఇంటర్మీడియట్ చేస్తున్నాడు. మా మొదటి కార్యాచరణ 1973, ఆగస్టు 15 నాడు ఆరంభమైంది. నాడు కరీంనగర్‌లోని పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో జరిగిన స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో మంత్రి జాతీయజెండా ఎగురవేసిన పిదప, డెమోక్రటిక్ స్టూడెంట్స్ పేరిట వేసిన 'బూటకపు స్వాతంత్ర్యాన్ని బద్దలు కొట్టండి'.. అన్న కరపత్రాన్ని పంచి పెడుతుండగా పోలీసులు అరెస్టు చేసి, కేసు పెట్టి కోర్టులో హాజరుపరచగా కోర్టు నన్ను బెయిల్‌పై విడుదల చేసింది. ఆ కరపత్రం కమ్యూనిస్టు దృక్పథంతో ప్రజాస్వామ్యంలో గల లొసుగులను, బూటకపు ప్రజాస్వామ్య విధానాలను ఎండగట్టింది. ఆ తర్వాత తొలుత పౌరహక్కుల సమావేశాలు, జన నాట్యమండలి ప్రదర్శనలు, విరసం సాహిత్య కార్యకలాపాలు, డెమోక్రటిక్ స్టూడెంట్స్ పేరుతో విప్లవ సిద్ధాంతాల ప్రచారం కొనసాగిస్తూ, కరపత్రాలు పంపిణీ చేస్తూ, బహిరంగ కార్యకలాపాలను నిర్వహించేవాళ్లం. 1973లో కరీంనగర్‌కు వచ్చిన శ్రీశ్రీతో మున్సిపల్ గెస్ట్ హౌజ్‌లో జరిపిన సమాలోచనలు, శ్రీశ్రీతో కలిసి పట్టణ వీధుల్లో పౌరహక్కుల ప్రచారంతో ఊరేగింపు తీయడం, శ్రీశ్రీతో కలిసి కరీంనగర్, మందమర్రి, లక్సెట్టిపేట్, బెల్లంపల్లి, మంచిర్యాల మొదలైనచోట్ల నిర్వహించిన పౌరహక్కుల సంఘం సభలు క్రమంగా మమ్మల్ని ఉద్యమంలో క్రియాశీలక స్థితికి తీసుకువచ్చాయి. 1975, ఫిబ్రవరిలో హైదరాబాద్‌లో జరిగిన ఆర్ఎస్‌యూ ప్రథమ రాష్ట్ర మహాసభలు, 1975లోనే శ్రీశ్రీతో హుజురాబాద్‌లో జన సాహితి సాహిత్య సభ మొదలైన కార్యకలాపాలన్నీ మమ్మల్ని ఉద్యమానికి మరింత దగ్గర చేశాయి.

> ఇట్లా బహిరంగ కార్యకలాపాలు కొనసాగుతున్న కాలంలోనే సుల్తానాబాద్ తాలూకా, సుల్తాన్‌పూర్ గ్రామంలో ప్రధానోపాధ్యాయునిగా పనిచేస్తున్న ముప్పాళ లక్ష్మణరావు 1975, జూన్ 25 నాడు రైతుకూలీ సభను ఏర్పాటుచేశాడు. ఆ సభలో మల్లోజుల కోటేశ్వరరావు ప్రధాన వక్తగా పాల్గొన్నాడు. ఇదే సభలో 'వీధి భాగోతం' నాటికను ప్రదర్శించాం. ఇందులో భూపాల్ దొరగా, నల్ల ఆదిరెడ్డి దొర జీతగానిగా, నేను రైతు కూలీగా, కోటేశ్వరరావు పట్వారిగా నటించాం.

ఈ సభ రాత్రి 2 గంటల వరకు జరిగింది. సభను ముగించుకొని కరీంనగర్‌లోని షెల్టర్‌లకు చేరుకొనే సరికి రాత్రి మూడు గంటలైంది. ఈ సభ జరుగుతున్నప్పుడే అర్ధరాత్రి దేశంలో ఎమర్జెన్సీ విధించడం జరిగింది. ఈ వార్తలు మాకు మరునాటి ఉదయం తెలిశాయి. ఈ ఎమర్జెన్సీ విధింపుతో అప్పటికే నిర్ణయమైన, జూన్ 26 నుంచి కరీంనగర్‌లో కొండపల్లి సీతారామయ్య ఆధ్వర్యంలో మూడు జిల్లాల (కరీంనగర్, నిజామాబాద్, ఆదిలాబాద్)కు చెందిన ముఖ్యమైన విప్లవకారుల కోసం నిర్వహించతలపెట్టిన రాజకీయ శిక్షణా తరగతులు వాయిదా పడ్డాయి.

కానీ, అప్పటికే మా కార్యకలాపాలపై నిర్బంధ ఛాయలు కమ్ముకుంటున్న తరుణంలో ఎమర్జెన్సీ విధించడంతో, నేను శత్రువు బారినుంచి తప్పించుకోవడానికి, మమ్మల్ని మేము రక్షించుకోవడానికి, ప్రజల వద్దకు వెళ్లి పనిచేయడానికి అండర్ గ్రౌండ్‌కు వెళ్లాలని కొండపల్లి సీతారామయ్య (కేఎస్) నిర్ణయించారు. ఎప్పటికైనా విప్లవాన్ని విజయవంతం చేయడానికి, ప్రజాసైన్యాన్ని ఏర్పాటు చేసి, సాయుధ పోరాటం నిర్మించడానికి అజ్ఞాతవాసంలోకి వెళ్లవలసిందే. కానీ, శత్రువు ఆ సమయాన్ని ఇంత త్వరగా ఇస్తాడనుకోలేదని ప్రకటించి ముఖ్య నాయకులంతా అజ్ఞాతంలోకి వెళ్లి, అప్పటికే ఉద్యమం బలంగా ఉన్న కొన్ని గ్రామాల్లో రహస్య స్థావరాలను ఏర్పాటు చేసుకొని, విప్లవ కార్యక్రమాలు కొనసాగిస్తూ జిల్లాలోని పలుచోట్ల భూస్వాముల ఆగడాలను అరికట్టాం. ఈ రకంగా ఎమర్జెన్సీ నిర్బంధం అమలవుతున్న కాలంలో అండర్ గ్రౌండ్‌లో కొనసాగుతూ, ప్రజల్లో పని చేస్తూ ఉండటం జరిగింది.

అజ్ఞాతవాసంలో ఉన్నప్పుడు ఒక రోజు నేను మానకొండూర్ మండలం ముంజంపల్లిలోని ఒక ఇంట్లో షెల్టర్ తీసుకుంటుండగా 1976, నవంబర్ 11న పోలీసులు నన్ను అరెస్టు చేసి ధర్మపురి పోలీస్‌స్టేషన్‌కు తరలించి, 'ఇన్నిరోజులు ఎక్కడెక్కడున్నావు, ఏమేం చేశావు, మీ ముఖ్య నాయకుల ఆచూకీ ఎక్కడ' అంటూ రహస్యాలు చెప్పమని ఆ రోజు రాత్రంతా చిత్రహింసలకు గురిచేశారు. రోకలిబండలెక్కించి దారుణంగా కొట్టారు.గోళ్లల్లో సూదులు గుచ్చారు. పట్టాతో వీపును పచ్చడిచేశారు. అయినా నేను నోరు విప్పకపోవడంతో, చివరికి వీపుపై పెట్రోల్ పోసి కాల్చారు. ఆ మచ్చ ఇప్పటికీ ఆ చీకటి రోజును గుర్తుచేస్తుంది. స్పృహ తప్పి పడిపోయిన నేను చనిపోయిన్నుకొని నన్ను పోలీస్‌స్టేషన్‌లో పాతిపెట్టేందుకు బొందను కూడా తవ్వారు. ఆ తర్వాత బతికే ఉన్నానని తెలుసుకున్న పోలీసులు 2వ రోజు జగిత్యాల పోలీస్‌స్టేషన్ లాకప్‌లో ఉంచారు. అప్పటికే ఆ స్టేషన్ లాకప్‌లో అల్లం నారాయణ, పోరెడ్డి వెంకటరెడ్డి, బి.విజయకుమార్ ఇంకా కొంతమంది ఉన్నారు. తర్వాత కరీంనగర్, ధర్మపురి, చిల్వకోడూర్, కోరుట్ల పోలీసు స్టేషన్లకు తిప్పుతూ దుర్మార్గమైన చిత్రహింసలను కొనసాగించారు. చివరికి కోరుట్ల పోలీసుస్టేషన్‌లో కాళ్లకు బేడీలు వేసి, గొలుసులతో బంధించి, 6 నెలలు నిర్బంధంలో ఉంచారు. 1977, ఏప్రిల్‌లో కేంద్రంలో జనతా పార్టీ అధికారంలోకి రాగానే ఎమర్జెన్సీని ఎత్తివేయడంతో కోరుట్ల పీఎస్‌లో ఉన్న నన్ను, అల్లం నారాయణ, పోరెడ్డి వెంకటరెడ్డి, మల్ల రాజిరెడ్డి, తాటికొండ సుధాకర్ రెడ్డి తదితరులను జగిత్యాల కోర్టులో హాజరుపరిచారు. కోర్టు మమ్మల్ని వరంగల్ సెంట్రల్ జైలుకు పంపించింది. ఆ తర్వాత ఆగస్టులో నేను బెయిల్‌పై విడుదలయ్యాను.

> ఎమర్జెన్సీ అఘాయిత్యాల మీద వేసిన షా కమిషన్ ముందు హాజరై, అదేవిధంగా రాష్ట్ర స్థాయిలో వేసిన భార్గవ కమిషన్ ఎదుట హాజరై అఫిడవిట్లు ఇచ్చాను. జైలు నుంచి విడుదలైన తర్వాత మళ్లీ యథావిధిగా విప్లవ కార్యక్రమాలు కొనసాగించాను.

ఎమర్జెన్సీ కంటే ముందు భూమయ్య, కిష్టాగౌడ్‌లకు పడిన ఉరిశిక్షను రద్దుచేయాలని రాష్ట్రవ్యాప్తంగా జరిగిన అనేక నిరసనలలో భాగంగా మేము కూడా మిగతా వారితో కలిసి కరీంనగర్ ఊరేగింపుల్లో పాల్గొన్నాం. దేశవ్యాప్తంగా అనేకమంది పౌరహక్కుల సంఘాల వాళ్లు ఈ ఉరిశిక్షను రద్దుచేయాలని పిలుపునిచ్చారు. అయితే ఎమర్జెన్సీ కాలంలో భూమయ్య, కిష్టాగౌడ్‌లను ఉరి తీయడం ఎమర్జెన్సీ చీకటి కోణానికి చిహ్నంగా భావించవచ్చు. ఈ ఎమర్జెన్సీ కాలంలో ఎంతోమంది విప్లవకారులు, సామాజిక ఉద్యమకారులు, పౌరహక్కుల సంఘాల కార్యకర్తలు, ప్రతిపక్ష నాయకులు తీవ్ర నిర్బంధాలను ఎదుర్కొని, జైలు జీవితాన్ని గడిపారు. కాలమేదైనా, పౌర సమాజం మెలకువతో ఉంటేనే ఇలాంటి నిర్బంధ చట్టాలు పునరావృతం కాకుండా ఉంటాయి. ఇలాంటి చీకటి రోజులు తిరిగి రాకూడదంటే, రేపటి తరం సామాజిక చైతన్యంతో మెలగవలసిన అవసరం ఎంతైనా ఉన్నది.

(వ్యాసకర్త: టీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్సీ)

రాష్ట్రంలో కృష్ణా నది సుమారు 61 శాతం ఉమ్మడి మహబూబ్‌నగర్‌లోనే ప్రవహిస్తున్నది. మరోవైపు తుంగభద్ర. ఇంకోవైపు భీమా.. దుందుభీ నదులు. అపారమైన నీటి వనరులు. మరోవైపు రాష్ట్రంలోనే అత్యంత సారవంతమైన ఎర్ర, నల్లరేగడి నేలలు. ఒకటి కాదు, రెండు కాదు ఏకంగా 35 లక్షల ఎకరాలకు పైగా సాగుకు యోగ్యమైన భూములు. ఈ నేపథ్యంలోనే హైదరాబాద్ స్టేట్ 1935 నుంచే అనేక ప్రాజెక్టులకు రూపకల్పన చేసింది. 174 టీఎంసీలను ఒడిసి పట్టి, కేవలం గ్రావిటీతోనే ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లాలో దాదాపు 7 లక్షల ఎకరాలకు సాగునీరందించేలా ప్రణాళికలను సిద్ధం చేసింది.

నీళ్ల దోపిడీ ఇక చెల్లదు

గవినోళ్ల శ్రీనివాస్
89198 96723

అప్పర్ కృష్ణా ప్రాజెక్టు, తుంగభద్ర డ్యామ్, భీమా ప్రాజెక్టుల నిర్మాణానికి సర్వేలు చేసింది. అనుమతుల కోసం పొరుగునున్న అప్పటి మైసూర్, మద్రాసు రాష్ట్రాలతో సంప్రదింపులు జరిపింది. ఒప్పందాలు చేసుకున్నది. ప్రాజెక్టుల పనులకు నడుంకడుతున్న తరుణంలోనే విలీనం పేరిట ఊహించని వంచనకు గురైంది. వద్దని వారించినా, నదీజలాల్లో హక్కు కోల్పోతామని మొత్తుకున్నా వినకుండా తేనె పలుకులతో నాటి కాంగ్రెస్ తెలంగాణను బలవంతంగా ఆంధ్రాలో విలీనం చేసింది. అది తెలంగాణకు, ముఖ్యంగా పాలమూరుకు శాపంలా మారింది.

> విలీనం వల్ల రాష్ట్ర ఉనికితోపాటు ట్రిబ్యునల్ ఎదుట వాదనలు వినిపించే అవకాశాన్ని హైదరాబాద్ స్టేట్ కోల్పోయింది. ఉమ్మడి ఏపీలో వివక్షకు గురై ఉన్న పరీవాహకం మేరకు కూడా కేటాయింపులు లేక అల్లాడిపోయింది. విలీనం నాటి బాసలన్నీ నీటిమూటలయ్యాయి. హైదరాబాద్ స్టేట్ ప్రణాళికలన్నీ అటకెక్కాయి. కనీసం కాగితాలపైన సైతం లేకుండా కనుమరుగయ్యాయి. వారేమైనా కొత్తవి కట్టారా? అంటే అదీ లేదు. పైపెచ్చు మొత్తంగా కృష్ణానే చెరబట్టే కుట్రలను అమలు చేశారు సీమాంధ్ర పాలకులు. అదొక 'ఒడువని ముచ్చట'. 60 ఏండ్ల పాలనలో చేసిన కుట్రలు.. తుంగలో తొక్కిన హామీలను మాటల్లో చెప్పలేం. ఇక నీళ్ల దోపిడీకి అంతే లేదు. ఉమ్మడి మహబూబ్ నగర్ దుర్భర దుస్థితిని చూసి బచావత్ ట్రిబ్యునలే చలించిపోయి జూరాల ప్రాజెక్టుకు 17.84 టీఎంసీలు కేటాయించడమే కాదు, ఆ జలాలను అక్కడ మాత్రమే వినియోగించాలని ఉమ్మడి ఏపీ సర్కారుకు షరతులు పెట్టిందంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు.

జూరాల దిగువన శ్రీశైలం ప్రాజెక్టు ఉంది. కృష్ణా ప్రధాన నదితో తుంగభద్ర, అటు తర్వాత భీమా నదులు రెండు కూడా వచ్చి ఆ ప్రాజెక్టు ఎగువన కలుస్తాయి. నీటి లభ్యత ఎక్కువగా ఉంటుంది. అదీగాక శ్రీశైలం ప్రాజెక్టు 215 టీఎంసీల నీటి నిల్వ సామర్థ్యం కాగా, దాదాపు 160 టీఎంసీలను వినియోగించుకునే అవకాశముంది. ఇది ఉమ్మడి పాలకులకు తెలియనిది కాదు. కానీ, తెలంగాణ ప్రాంతానికి నీటిని అందించే ప్రాజెక్టులన్నింటినీ అసలే అనేక చిక్కుల్లో ఉండి, నీటిని నిల్వ చేయని స్థితిలో ఉన్న జూరాల కేంద్రంగానే ప్రతిపాదించారు. కల్వకుర్తి మినహా రాజీవ్ భీమా లిఫ్ట్, కోయిల్‌సాగర్, నెట్టెంపాడు అన్నీ జూరాల నుంచే ప్రతిపాదించారు. కారణం ఒక్కటే తెలంగాణకు కృష్ణా నీళ్లు దక్కకూడదనే కుట్ర. అందుకే తెలంగాణ ఏర్పాటు నాటికీ ఆ ప్రాజెక్టులనూ పూర్తి చేయలె. మరొకవైపు కృష్ణమ్మ గట్టునున్న మన నోళ్లు కొట్టి వందల కిలోమీటర్ల దూరంలోని చెన్నై నగరవాసుల దూప తీర్చే మాటున శ్రీశైలం ప్రాజెక్టుకు పొక్క కొట్టారు. 2004లో ఉమ్మడి ఏపీ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి పాలమూరు జిల్లాకు చంద్రబాబును మించిన ద్రోహానికి తలపెట్టారు. జలయజ్ఞంలో భాగంగా చేపట్టిన కృష్ణా బేసిన్‌లోని తెలంగాణ ప్రాజెక్టులను సెకండ్ ప్రయారిటీ జాబితాలో చేర్చి నిధులను కేటాయించలేదు.

పెన్నా బేసిన్‌లోని ఏపీ ప్రాజెక్టులను మొదటి ప్రయారిటీగా తీసుకుని నిధుల వరద పారించి పనులను పరుగులు పెట్టించారు. అనేక కుట్రలతో, అనైతికంగా ఏర్పాటైన పోతిరెడ్డిపాడు హెడ్‌రెగ్యులేటర్ సామర్థ్యాన్నీ 44 వేల క్యూసెక్కులకు పెంచారు. మళ్లీ అందులోనూ మరో కుట్ర. హెడ్‌రెగ్యులేటర్ కెపాసిటీని భవిష్యత్తులో 88 వేల క్యూసెక్కులకు పెంచుకునేందుకు అనువుగా కెనాల్ బెడ్ లెవల్‌ను ఆనాడే 32 మీటర్ల నుంచి ఏకంగా 78 మీటర్లకు పెంచడంతో పాటు, లైనింగ్ లేని కెనాల్‌ను ప్రతిపాదించారు. వీటికి అదనంగా హంద్రీనీవా, గాలేరు నగరి సుజల స్రవంతి, మల్యాల, ముచ్చుమర్రి లిఫ్టులను శ్రీశైలం ఆధారంగానే పెట్టి కృష్ణను కొల్లగొట్టారు. రాష్ట్ర ఏర్పాటు నాటికి కృష్ణా బేసిన్‌లోనే ఉన్న మహబూబ్ నగర్‌లో నీటి నిల్వ సామర్థ్యం అన్ని ప్రాజెక్టులు కలిపి 20 టీఎంసీల కంటే తక్కువే. కానీ, నీటి లభ్యత లేని, కృష్ణా బేసిన్‌పైనే ఆధారపడిన పెన్నా బేసిన్‌లో మాత్రం నీటినిల్వ సామర్థ్యం 300 టీఎంసీలకు పైగానే అంటే నీటి దోపిడీ ఏ రీతిన కొనసాగిందో అర్థం చేసుకోవచ్చు. 1500 క్యూసెక్కులతో మొదలై మొత్తం కృష్ణా నదినే మళ్లించే స్థాయికి ఏపీ దోపిడీ కొనసాగిందనేందుకు ఇదే తార్కాణం.

ఉమ్మడి పాలకుల కుట్రలను, సాగిస్తున్న జలదోపిడీని నిలదీసింది కేసీఆరే. కృష్ణా జలాల్లో నీటి కోసం పాలమూరు బిడ్డల కోసం ఉద్యమించారు. జలసాధన ఉద్యమం చేపట్టి ఊరూరా ప్రజలను చైతన్యవంతులను చేశారు. అలుపెరగని పోరాటం సలిపారు. ఇక గతిలేని పరిస్థితుల్లో 2013లో పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకానికి నాటి కాంగ్రెస్ సర్కార్ ఆమోదం తెలిపింది. అక్కడా మరో మెలిక. ఎప్పుడూ లేనివిధంగా ఆ ప్రాజెక్టు జీవోను కూడా సీజీజీ (సెంటర్ ఆఫ్ గుడ్ గవర్నెన్స్)తో వెట్టింగ్ చేయించాలని షరతు పెట్టి టెండర్ల ప్రక్రియను అడ్డుకుంది. ఉద్యమనేతగా కేసీఆర్ నిప్పులు చెరిగారు. ప్రత్యేక రాష్ట్రం వస్తే తప్ప పాలమూరుకు మోక్షం తప్పదని వివరించారు. తెలంగాణ ఏర్పాటు అనంతరం ఉద్యమ హామీ మేరకు స్వరాష్ట్రంలో మొట్టమొదటగా పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకానికి కేసీఆర్ శ్రీకారం చుట్టారు. ప్రాజెక్టును పూర్తిగా రీడిజైన్ చేశారు. వరద జలాల ఆధారంగా ఉమ్మడి పాలకులు ప్రాజెక్టును ప్రతిపాదిస్తే దానికి 90 టీఎంసీల నికర జలాలు కేటాయించారు. ఆయకట్టును 10 లక్షల ఎకరాల నుంచి 12.30 లక్షలకు పెంచారు. ప్రాజెక్టు ప్రధాన పనులను పూర్తి చేశారు. డిస్ట్రిబ్యూటరీ కెనాళ్లను మాత్రమే తవ్వాల్సి ఉంది. అంతే కాదు మహబూబ్ నగర్‌లో నీటినిల్వ సామర్థ్యాన్ని ఈ ఒక్క ప్రాజెక్టు ద్వారానే 67 టీఎంసీలకు పెంచారు. మరికొన్ని రిజర్వాయర్ల సామర్థ్యం పెంపునకు ప్రణాళికలు సిద్ధం చేశారు. పెండింగ్ ప్రాజెక్టులు పూర్తి చేశారు. చెరువులు, చెక్‌డ్యాముల నిర్మాణం, ప్రాజెక్టుల అనుసంధానం వంటి బహుముఖ వ్యూహాలను అమలు చేశారు. రాష్ట్ర ఏర్పాటు నాటికి చెరువుల కింద అదీ ముక్కుతూ మూలుగుతూ 2 లక్షల ఎకరాలకు మించి సాగు చేయలేని దుస్థితి నుంచి పాలమూరులో 12 లక్షల ఎకరాల ఆయకట్టును సాగులోకి తీసుకొచ్చారు.

వలసలన్నీ వాపస్ వస్తున్న తరుణంలో మళ్లా కాంగ్రెస్ వచ్చింది. 'పాలమూరు' మళ్లీ ప్రశ్నార్థకంగా మారింది. 18 నెలలుగా ప్రాజెక్టును కాంగ్రెస్ సర్కారు పండబెట్టింది. కాలువల టెండర్లు రద్దు చేసింది. పాలమూరుకు మరోమారు తీరని విద్రోహాన్ని కాంగ్రెస్ తలపెడుతున్నది. పోతిరెడ్డిపాడు ద్వారా పెన్నా బేసిన్‌కు కృష్ణా జలాలను మళ్లించిన ఏపీ ఇప్పుడు గోదావరినీ తరలించేందుకు శరవేగంగా అడుగులు వేస్తున్నది. టెండర్లను పిలిచేందుకు సిద్ధమైంది. నిధులు సాయం చేసేందుకు కేంద్రంలోని బీజేపీ సర్కారు భరోసా ఇస్తున్నది. రాష్ట్రంలో రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ సర్కారు మాత్రం చోద్యం చూస్తున్నది. 60 ఏండ్ల పాటు చేసిన ద్రోహాన్ని సరిదిద్దుకోకుండా మళ్లీ ఇప్పుడు అదే రీతిన ద్రోహాన్ని తలపెడుతున్నది. పొరుగు రాష్ట్రాన్ని చూసైనా ప్రాజెక్టులను పూర్తి చేసి నీటిని ఎత్తిపోసుకోవాలని, నిల్వ సామర్థ్యం పెంచుకోవాలనే సోయి కూడా లేకుండా వ్యవహరిస్తున్నది. రాజకీయాలకు పాలమూరును పణంగా పెడుతున్నది. ఈ ప్రాంతంవాడే ద్రోహం తలపెట్టడం అత్యంత విషాదం. హస్తం పార్టీ తీరుతో పాలమూరుకే కాదు.. నల్లగొండ జిల్లా డిండికి, హైదరాబాద్ తాగునీటికి భవిష్యత్తులో ముప్పు వాటిల్లనున్నది.

> పాలమూరు బిడ్డలుగా ఇప్పుడు మేం అడుగుతున్నదొక్కటే. పాలమూరు జిల్లా బిడ్డలు ఈ దేశ పౌరులు కారా? ఇక్కడ కరువు లేదా? తాగునీటి తండ్లాటలు వినిపిస్తలేవా? సాగునీరందక నోళ్లు తెరచిన బీళ్లు కండ్లపడుతలేవా? మాకెందుకివ్వరు నీళ్లు, నిధులు? ఎంతకాలమీ జలదోపిడీ? ఎందుకు మాకీ శిక్ష, మాపై వివక్ష? ఇక సహించేది లేదు. మౌనం వహించేది లేదు. పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టును కాంగ్రెస్ యుద్ధప్రాతిపదికన పూర్తిచేయాలె. ప్రాజెక్టుకు కేంద్రం జాతీయ హోదా ప్రకటించాలె. పాలమూరు పచ్చదనం కోసం కేసీఆర్ రూపొందించిన ప్రణాళికలను అమలుచేయాలి.

ఇక పోలవరం బనకచర్ల లింక్ ప్రాజెక్టుతో పెన్నా బేసిన్‌కు గోదావరి జలాలను మళ్లించినట్లయితే కృష్ణాలో ఏపీ తన వాటా వదులుకోవాలి. పోతిరెడ్డిపాడును బంద్ పెట్టాలి. అక్రమంగా పెట్టిన లిఫ్టును తొలగించాలె. ఆ జలాలను కృష్ణా బేసిన్‌లోని మహబూబ్‌నగర్, నల్లగొండ జిల్లాల్లోని ప్రాజెక్టులకు న్యాయబద్ధంగా కేటాయించాలి. లేదంటే జలహక్కుల రక్షణకు, సాధనకు కేసీఆర్ స్ఫూర్తితో నాడు రాయలసీమ ప్రాజెక్టును నిలువరించినట్లే బనకచర్లను అడ్డుకుంటాం. బరిగీసి కొట్లాడుతాం. ప్రాంతేతరుడైనా, ప్రాంతం వాడైనా సరే తరిమికొడుతాం. అందులో భాగంగానే కృష్ణా జలాల సాధనకు ఉద్యమనేత కేసీఆర్ గర్జించిన ఆర్డీఎస్ వేదికగానే జలహక్కుల రక్షణకు జంగ్ సైరన్ మోగిస్తున్నాం. పాలమూరు బిడ్డలు కదలిరావాలి. భావితరాల భవిష్యత్తును కాపాడుకోవాలె.



బీజేపీ పాలిత రాష్ట్రాల్లో దాడులపై నోరు మెదపరా?

బీజేపీ పాలిత రాష్ట్రాల్లో బెంగాలీలపై బంగ్లాదేశీయులనే ముద్రవేసి దాడులు చేస్తున్నారు. మహిళలు, దళితులు, మైనారిటీలపైనా దాడులు జరుగుతున్నాయి. బెంగాల్‌లో ఏ చిన్న ఘటన జరిగినట్టు ఆరోపణలు వచ్చినా కేంద్రంలోని మోదీ సర్కారు వెంటనే 10 బృందాలను పంపిస్తుంది. కానీ, బీజేపీ పాలిత రాష్ట్రాల్లో వరుస దురాగతాలు జరుగుతున్నా నోరు మెదపదు.

- మమతాబెనర్జీ,
పశ్చిమబెంగాల్ ముఖ్యమంత్రి